సాక్షి తిరుపతి

బుధవారం, 3, మే, 2023



ఔరా..అల్లూరయ్యా!

గుట్టుచప్పుడు కాకుండా ఇళ్ల స్థలాలను విక్రయించి సొమ్ముచేసుకుంటున్న మున్సిపల్ ఉద్యోగి అల్లూరయ్య బాగోతం బట్టబయలైంది. -8లో



'ఎమ్మెస్కే'పోలీస్‌శాఖలో విలీనం

ఎమ్మెస్కే వ్యవస్థ పూర్తిగా పోలీస్ శాఖలో విలీనమైందని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి స్పష్టం చేశారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	26
చిత్తూరు	32	24
తిరుమల	28	21
గూడూరు	33	27
నగరి	33	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 81,183 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 33,990 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆన్‌లైన్ శిక్షణ



సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ ముఖచిత్రం(ఫైల్)

సూళ్లూరుపేట: పోస్టు గ్రాడ్యుయేట్స్, అండర్ పోస్టు గ్రాడ్యుయేట్స్‌కు ఇస్రో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ ట్రైనింగ్ (స్టార్ట్) పేరుతో కొత్తగా ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్టుగా ఇస్రో తన అధికారిక వెబ్‌సైట్‌లో మంగళవారం పేర్కొంది. ఖగోళశాస్త్రం, ఖగోళ భౌతికశాస్త్రం, హీలియోఫిజిక్స్, సన్-ఎర్త్ ఇంటరాక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఏరోనమీతో సహా అంతరిక్షశాస్త్రంలోని వివిధ డొమైన్‌లను కవర్ చేస్తూ భారతీయ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఇస్రో కేంద్రాల్లో పనిచేసే సీనియర్ శాస్త్రవేత్తలు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

14న ముస్లింల ఆత్మీయ సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముస్లిం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ముస్లిం సామాజిక అభివృద్ధి కోసం ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌వలి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముస్లిం ఆత్మీయ సమావేశం పోస్టర్లను ఆవిష్కరించారు. ముస్లిం ఐక్య వేదిక ప్రతినిధులు సయ్యద్ సలాఉద్దీన్, సయ్యద్ ఖలీల్, సయ్యద్‌నూర్, నజీర్, ఫయాజ్, డాక్టర్ మస్తాన్‌వలి, సయ్యద్ నిజాముద్దీన్, సాధిక్, సర్ఫరాజ్ పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీ రాష్ట్ర డైరెక్టర్‌గా దొడ్లగౌరి



తిరుపతి రూరల్: రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా దొడ్ల గౌరి నియమితులయ్యారు. అకాడమీకి గౌరితో పాటు మరో ముగ్గురు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీవో విడుదల చేసింది. రెండేళ్ల పాటు వీరు పదవిలో ఉంటారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి తల్లి గౌరి. ఇప్పటి వరకు ఆమె హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఉన్నారు. మరోసారి ఆమెకు రాష్ట్ర స్థాయి పదవి దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుల హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నం.14567



హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ స్టిక్కర్‌ని అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నం.14567ని ప్రవేశ పెట్టింది. మంగళవారం చిత్తూరు, కడప జిల్లాల కో-ఆర్డినేటర్లు టోల్ ఫ్రీ నంబర్ స్టిక్కర్‌ని తహసీల్దార్ భాగ్యలక్ష్మికి అందజేశారు. ఈ నంబర్‌కి నిరాశ్రయులు ఫోన్ చేయడం ద్వారా వృద్ధాశ్రమాలు, సంరక్షణ కేంద్రాలు, కార్యాచరణ కేంద్రాలు, హాస్పిటల్స్ వివరాలు అందుతాయని తెలిపారు. వృద్ధులను హింసించినా, ఇంటి బయటకు గెంటివేసినా వారికి రక్షణ కల్పిస్తామని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు.



విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన పథకాలతో విశేషంగా కృషి చేస్తోంది. నాడు-నేడు కింద సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతోంది. సరికొత్తగా ప్రవేశపెట్టిన సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం సైతం చేయూతనందించేందుకు ముందుకు వచ్చింది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం ద్వారా ఎంపిక చేసిన పాఠశాలలకు అదనపు నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోంది. అలాగే నూతన విద్యా విధానంలో భాగంగా ఐదేళ్లపాటు ఆయా బడులకు ఆర్థిక.. సాంకేతిక సహకారం అందించేలా ప్రణాళిక రూపొందించింది.

మరింతగా మెరుగు'బడి'



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన నగరిలోని ఎం.కొత్తూరు పాఠశాల

- నాడు-నేడుకు తోడుగా పీఎంశ్రీ
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం
- ఉమ్మడి జిల్లాలో 44 స్కూళ్ల ఎంపిక
- అదనపు నిధులతో ఉన్నతంగా వసతులు

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నాడు-నేడు పథకం కింద సర్కారు బడులను దశలవారీగా ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా కార్పొరేట్ స్థాయి వసతులను కల్పిస్తోంది. జాతీయ స్థాయి పోటీకి తగ్గట్టుగా నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తోంది. విద్యా ప్రమాణాలను మరింత పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు కేంద్ర ప్రభుత్వం సైతం సహకారం అందిస్తోంది. 'ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' పథకం కింద రాష్ట్రంలోని పలు పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఎంపిక చేసిన పాఠశాలలకు ఐదేళ్ల వరకు ఆర్థికంగా, సాంకేతికంగా అండదండలందించనుంది.

అదనపు వసతులు

ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నే రీతిలో అభివృద్ధి చెందనున్నాయి. నాడు-నేడుకు తోడుగా పీఎంశ్రీ పథకం తోడు కావడంతో బడుల్లో అదనపు వసతులు సమకూరనున్నాయి. ఈ మేరకు పీఎంశ్రీ పథకానికి చిత్తూరు జిల్లాలో 21, తిరుపతి జిల్లాలో 23 పాఠశాలలు ఎంపికయ్యాయి. పాఠశాల విద్య అత్యున్నత ప్రమాణాలకు ఈ పథకాలు దోహదపడనున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు

మండలం	పాఠశాల	మండలం	పాఠశాల
బంగారుపాళెం	జీహెచ్ఎస్, బంగారుపాళెం	బుచ్చినాయుడు కండ్రిగ	జెడ్పీహెచ్ఎస్, బీఎన్ కండ్రిగ
చిత్తూరు	ఎంపీపీఎస్, తుమ్మిండ	చంద్రగిరి	జెడ్పీహెచ్ఎస్, చంద్రగిరి (బాలికలు)
చిత్తూరు అర్బన్	ఎంహెచ్ఎస్, గిరింపేట	చిల్లకూరు	జెడ్పీహెచ్ఎస్, వరగలి
గంగాధర నెల్లూరు	జెడ్పీహెచ్ఎస్, నీలపల్లె	చిన్నగొట్టిగల్లు	జెడ్పీహెచ్ఎస్, చిన్నగొట్టిగల్లు
గంగవరం	జెడ్పీహెచ్ఎస్, గంగవరం	చిట్టమూరు	జెడ్పీహెచ్ఎస్, మెట్టు
గుడిపాల	జెడ్పీహెచ్ఎస్, నరహరిపేట	డక్కిలి	జెడ్పీహెచ్ఎస్, డక్కిలి
గుడిపల్లె	జెడ్పీహెచ్ఎస్, శెట్టిపల్లె	దొరవారిసత్రం	మోడల్ స్కూల్, మావిలపాడు
కార్వేటినగరం	జెడ్పీహెచ్ఎస్, కత్తెరపల్లె	కేవీబీపురం	ఏపీఎంఎస్, కేవీబీపురం
నగరి	జెడ్పీహెచ్ఎస్, ఎం.కొత్తూరు	కోట	ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, చిట్టేడు
పలమనేరు	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పలమనేరు (బాలికలు)	నాగలాపురం	జెడ్పీహెచ్ఎస్, బీరకుప్పం
		నారాయణవనం	జెడ్పీహెచ్ఎస్, పాలమంగళం
		ఓజిలి	ఏపీఆర్ఎస్, చిల్లమంచేను
పెదపాంజాణి	కేవీసీఆర్ జెడ్పీహెచ్ఎస్, రాయలపేట	పాకాల	జెడ్పీహెచ్ఎస్, దామలచెరువు
పెనుమూరు	జెడ్పీహెచ్ఎస్, పెనుమూరు	పిచ్చాటూరు	జెడ్పీహెచ్ఎస్, పిచ్చాటూరు
పుంగనూరు	ఏపీఎంఎస్, తూనిగుంట	రేణిగుంట	జెడ్పీహెచ్ఎస్, రేణిగుంట (బాలికలు)
పూతలపట్టు	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పూతలపట్టు (బాలురు)	సత్యవేడు	ఎంజేపీఏపీ, సత్యవేడు
		శ్రీకాళహస్తి	జెడ్పీహెచ్ఎస్, తొండమనాడు
రొంపిచర్ల	జెడ్పీహెచ్ఎస్, రొంపిచర్ల (బాలురు)	తడ	ఏపీఎంఎస్, తడ
శాంతిపురం	జీహెచ్ఎస్, శాంతిపురం	తిరుపతి రూరల్	జెడ్పీహెచ్ఎస్, తిరుచానూరు
శ్రీరంగరాజాపురం	జెడ్పీహెచ్ఎస్, కొత్తపల్లెమిట్ట	వడమాలపేట	జెడ్పీహెచ్ఎస్, వడమాలపేట (బాలురు)
తవణంపల్లె	జెడ్పీహెచ్ఎస్, తవణంపల్లె		
వెదురుకుప్పం	జెడ్పీహెచ్ఎస్, వెదురుకుప్పం	వరదయ్యపాళెం	జెడ్పీహెచ్ఎస్, వరదయ్యపాళెం
విజయపురం	జెడ్పీహెచ్ఎస్, పన్నూరు	ఏర్పేడు	జెడ్పీహెచ్ఎస్, పాళెం
యాదమరి	జెడ్పీహెచ్ఎస్, యాదమరి	ఏర్రావారిపాళెం	ఏపీఎంఎస్, ఎర్రావారిపాళెం

మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ

- పీఎంశ్రీ పథకానికి పాఠశాలలను మూడంచెల్లో ఎంపిక చేస్తారు.
- నిర్దేశిత ఫార్మెట్‌లో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ముందు దరఖాస్తు చేసుకోవాలి.
- కేంద్రా విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన దరఖాస్తులను తనిఖీ చేస్తారు.
- నిపుణుల కమిటీ ద్వారా ఉన్న పాఠశాలలను ఎంపిక చేస్తారు.
- 2021-22 విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ఆయా పాఠశాలలను ఎంపిక చేశారు.

ప్రయోజనాలు..

- పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయిస్తుంది.
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలను కల్పిస్తుంది.
- ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుంది.
- విడతల వారీగా మంజూరయ్యే నిధులతో విద్యార్థులకు అవసరమైన పరికరాలను సమకూర్చుకునే వెసులుబాటు ఇస్తుంది.
- పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడా సామగ్రి తదితర వసతులను కల్పిస్తుంది.
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపు, ఫలితాల సాధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది

శుభ పరిణామం



పాఠశాలలకు అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుంది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నాయి. ఇది శుభపరిణామం.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ఉత్తమ ఫలితాలకు అవకాశం



నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అందంగా రూపుదిద్దుకున్నాయి. విద్యా విధానంలో పలు మార్పులు చోటు వచ్చాయి. నేడు పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు మరిన్ని వసతులు సమకూరనున్నాయి. బోధనా విధానంలోనూ మార్పులు తీసుకొస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఏర్పడింది.

– రఘురామయ్య, డిప్యూటీ డీఈఓ, పుత్తూరు

దేవతలారా రండి!

- వైభవంగా ధ్వజారోహణం
- తిరుచ్చిపై విహరించిన నృసింహుడు



శేష వాహనంపై స్వామి,అమ్మవార్లు



ధ్వజస్తంభం వద్ద గరుత్మంతునికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని గరుడుడి ద్వారా సకలదేవతలకు అర్చకులు ఆహ్వానం పంపారు. ఉదయం 5 గంటలకు దేవదేవేరులకు ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించారు. తర్వాత ప్రత్యేక పూలంగి సేవ నిర్వహించారు. 8 గంటలకు గరుత్మంతుడి చిత్రపటాన్ని (తెల్లటి వస్త్రంపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా తయారుచేసిన గరుత్మంతుని చిత్రాన్ని చిత్రీకరించి) తిరుచ్చిపీఠంపై కొలువుదీర్చి ఆలయంలో గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా తిరుచ్చిపై కొలువుదీర్చిన స్వామివార్లు కోన మాడ వీధుల్లో ఊరేగుతూ ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. అర్చకులు గరుత్మంతుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఈఓ జనార్దన్‌రెడ్డి, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

కొడిముద్దల కోసం పోటీ

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో జరిగే ధ్వజారోహణానికి ఎంతో విశిష్టత ఉంది. గరుత్మంతుడికి పూజలు, అభిషేకాలకు ఉపయోగించిన ప్రసాదాలను స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇందులో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని ప్రసాదం కోసం పోటీపడ్డారు.

స్నపన తిరుమంజనం

స్వామి, అమ్మవార్లకు క్రేన్ మండపంలో మధ్యాహ్నం స్నపనతిరుమంజనం నిర్వహించారు. తర్వాత రాత్రి పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులను తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో 1008 సహస్రదీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు శ్రీవార్లకు పూలంగిసేవ, 8 గంటలకు హంస వాహనసేవ, మధ్యాహ్నం 11.50 గంటలకు స్నపనతిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకార సేవ నిర్వహించనున్నారు. రాత్రి బంగారు హనుమంత వాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

బీసీలపై ప్రత్యేక దృష్టి



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారి అభివృద్ధికి బాటలు వేశారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని టీఎంవీకండ్రిగ గ్రామంలో టీడీపీకి చెందిన 15 బీసీ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో కన్నెమ్మ, మాధవి, అనురాధ, రమ, లత, మస్తాన్, బుజ్జి, పట్టాభి, సుబ్బారెడ్డి, భాస్కర్, గోవిందరెడ్డి, వెంకటస్వామిరెడ్డి, రామారావు, కులపరెడ్డి ఉన్నారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగాల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, రత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భత్యం.. హర్షం!

- ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ పెంపు
- ఇచ్చిన మాట నెరవేర్చిన ప్రభుత్వం
- కొత్త జీవో అమలుకు ట్రెజరీశాఖ సన్నాహాలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సర్కారు తీపి కబురు అందించింది. కరువు భత్యం (డీఏ) పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను 2.73 శాతం మంజూరు చేసింది. పెంచిన డీఏ ప్రకారం కసరత్తు నిర్వహించి జూలై 1 నుంచి ఉద్యోగులకు, పెన్షనర్లకు అందజేసేందుకు చర్యలు చేపట్టింది.

22.75 శాతానికి పెంపు

ప్రభుత్వం జీరీ చేసినన జీఓ నంబర్ 66, 67 మేరకు ఉద్యోగుల, పెన్షనర్ల మొత్తం డీఏ 20.2శాతం నుంచి 22.75 శాతానికి చేరింది. అలాగే ఉద్యోగ విరమణ చేసినవారికి పెంచిన డీఏ బకాయిలను వారి బెనిఫిట్స్‌లో కలిపి చెల్లించనున్నారు. డీఏ పెంపు జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సమితి, 2022లో సవరించిన రెగ్యులర్ స్కేళ్లు పొందుతున్న వర్క్ చార్జ్‌డ్, ఎయిడెడ్ ఇనిస్టిట్యూషన్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎయిడెడ్ పాలిటెక్నిక్, యూనివర్సిటీ సిబ్బంది, ఉద్యోగులందరికీ కొత్త జీవో వర్తిస్తుందని ట్రెజరీ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమాచారం

	చిత్తూరు జిల్లా	తిరుపతిజిల్లా
ఉద్యోగులు	21,923	22,454
పెన్షనర్లు	12,845	14,245

సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు డీఏ పెంచుతూ జీఓ విడుదల చేయడం సంతోషంగా ఉంది. దీంతో మాకు 2.73 శాతం డీఏ పెరిగింది. ఈ జీఓ కారణంగా విశ్రాంత ఉద్యోగులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇచ్చిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయనకు రుణపడి ఉంటాం.

– కేశవులు, విశ్రాంత ఉద్యోగి

శుభపరిణామం



డీఏ పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేయడం శుభపరిణామం. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సానుకూలంగా స్వాగతిస్తున్నాం. ఉద్యోగ సంఘం నాయకులు అడిగిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ప్రకాష్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు, చిత్తూరు.

హర్షణీయం



ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏ పెరగనుంది. డీఏ 2.73 శాతం పెంచడం హర్షణీయం. ఉద్యోగుల బేసిక్ పే ప్రకారం పెరిగిన డీఏను అమలు చేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగ సంఘం నాయకులతో ప్రభుత్వం చర్చించి ఆ మేరకు సానుకూల నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

– బాలాజీ, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగులకు మేలు



ప్రభుత్వం జారీ చేసిన డీఏ ఉత్తర్వులతో ఉద్యోగులందరికీ మేలు చేకూరుతోంది. టీచర్లు, ఇతర శాఖల ఉద్యోగులకు మరింత ప్రయోజనం కలగనుంది. ఉద్యోగుల ఇబ్బందులను సానుకూలం ధోరణితో పరిశీలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – వినాయకం, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రభుత్వ మా ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. డీఏ పెంచుతూ జీఓ విడుదల చేయడం అభినందనీయం. డీఏ బకాయిలను సెప్టెంబర్, డిసెంబర్‌లో చెల్లిస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. కరువు భత్యాన్ని 22.75 శాతానికి పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– విజయ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

క్లుప్తంగా

విలువలతో కూడిన విద్య ఉన్నతికి మార్గదర్శకం


జ్యోతి ప్రజ్వలన చేసి సంస్కార శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మానవీయ విలువలతో కూడిన విద్య ప్రతివ్యక్తి ఉన్నతికి మార్గదర్శకంగా నిలిచి ఉత్తములుగా రూపొందిస్తుందని భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యానాయణరాజు తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో తలపెట్టిన సంస్కార శిక్షణా శిబిరం మంగళవారం ఆశ్రమ ఆవరణలోని వివేకానంద సభా ప్రాంగణంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దేశంలో విద్య అంటే ఆధ్యాత్మిక, ఆర్మీ విద్య అని ఒకప్పుడు ఉండేవన్నారు. విద్య మనలోని అంతర్గత శక్తిని మేల్కొలుపుతుందని తెలిపారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందజీ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా సంస్కార శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మరో విశిష్ట అతిథి శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరిదేవి మాట్లాడుతూ పిల్లలను సన్మార్గంలో నడిపించి వారిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు డాక్టర్ జీఎస్.ప్రసాద్, గంగవరం శ్రీదేవి, గోవింద చంద్రమౌళి, ఆకాశవాణి పూర్వ డైరెక్టర్ మల్లేశ్వరరావు, జయరామ ప్రసాద్ పాల్గొన్నారు.

పెట్రోల్ దాడిలో గాయపడిన మహిళ మృతి


ఆదిలక్ష్మి(ఫైల్)

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): పెట్రోల్ దాడికి గురైన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వివరాలు.. మండలంలోని బోనుపల్లి దళితవాడకు చెందిన ఆదిలక్ష్మిపై ఆమె భర్త గత నెల 24వ తేదీన పెట్రోల్ పోసి తగలబెట్టిన విషయం తెల్సిందే. అప్పటి నుంచి తిరుపతి రూయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. సీఐ విక్రమ్ ఆదేశాల మేరకు ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో కార్మికులకు చెవిరెడ్డి కానుక


పాకాల మండలంలో ఆటో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


తిరుచానూరులో ఆటో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్రారెడ్డి

- చంద్రగిరి నియోజకవర్గంలో 2,500 మందికి దుస్తులు పంపిణీ
- కార్మికులకు అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

తిరుపతి రూరల్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆటో కార్మికులకు అద్భుత కానుకను అందించారు. నియోజకవర్గ పరిధిలోని ఆటో కార్మికులకు మూడు జతల ఖాకీ దుస్తులు అందజేసి గౌరవించారు. చంద్రగిరి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం పాకాల మండలంలో ప్రారంభించిన ఈ కార్యక్రమం భాకరాపేట, యర్రావారిపాళెం, చంద్రగిరి, మంగళం, తిరుచానూరు, రామచంద్రాపురం, మల్లంగుంట ప్రాంతాల్లో సాగింది. మొత్తం 3,400 మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి ఒక్కొక్క కార్మికుడికి వ్యక్తిగతంగా దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా, తోపుడు బండ్లు, బుట్ట వ్యాపారస్తులకు జగనన్న తోడు కింద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్ఫూర్తి

'జీవితంలో కష్టపడి పనిచేయడానికి ఎప్పుడూ వెనుకాడకూడదు.. అది మనకు ఎల్లప్పుడూ విజయాన్ని అందిస్తుందని' ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితమవుతానని మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులు, వినియోగదారులు, వ్యాపారులను కుటుంబ సభ్యుల్లా భావించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, వారపు సంతల్లో ఉచిత భోజన సదుపాయం కల్పించారని, వ్యాపార రుసుంలు రద్దు చేశారని తెలిపారు. ఒక్క చంద్రగిరి వారపు సంతలో రూ.24.23 లక్షల వ్యాపార రుసుమును ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులు చెల్లించారని తెలిపారు. ఆటో కార్మికులు పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను రూ.7.04 లక్షలను కూడా ఆయన చెల్లించారని గుర్తుచేశారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- రేపటి నుంచి శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు


అమ్మవారి ఆలయంలోని ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఇతర సిబ్బంది

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

నేడు అంకురార్పణ

పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం బుధవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు.

ఆలయానికి పరదాల వితరణ

హైదరాబాద్‌కు చెందిన శ్రీ స్వర్ణకుమార్‌రెడ్డి 12 పరదాలను విరాళంగా అందించారు. ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ పాల్గొన్నారు.

తెలుగంగ కాలువలో పడి రెండేళ్ల బాలుడి మృతి


ఆస్పత్రి వద్ద గుండెలు బాధుకుంటూ రోదిస్తున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు(ఇన్‌సెట్) తెలుగు గంగ కాలువలో పడి మృతి చెందిన బాలుడు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో రెండేళ్ల బాలుడు యాటగిరి తేజ (2) పడి మృత్యువాత పడ్డాడు. ఇంటి ఆవరణలో ఆటలాడుకుంటూ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో పడిపోయాడు. శ్రీనివాపురం గ్రామానికి చెందిన యాటగిరి బద్రి, చెంచుకృష్ణమ్మ రెండవ కుమారుడైన తేజ మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 15 ఏళ్ల తర్వాత పుట్టిన తేజను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెస్కే వ్యవస్థ పోలీస్ శాఖలో విలీనం


సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి


సమావేశానికి హాజరైన ఎమ్మెస్కేలు

తిరుపతి క్రైమ్: ఎమ్మెస్కే వ్యవస్థ పూర్తిగా పోలీస్ శాఖలో విలీనమైందని, ఇప్పుడు వారంతా మహిళా పోలీస్ లేనని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఎస్పీ పీ.పరమేశ్వర్‌రెడ్డితో కలిసి తిరుపతి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తించే ఎమ్మెస్కేలతో వారి పనితీరు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఇచ్చిన ఎమ్మెస్కేల జాబ్ చార్ట్, ప్రవర్తనా నియమావళిని వివరించారు. అనంతరం ఇప్పటివరకు ఎమ్మెస్కేలు నిర్వర్తించిన పనితీరుపై సబ్ డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహించి, వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. రోజూ తమ పరిధిలోని కళాశాల, పాఠశాల, అంగన్‌వాడీ, హాస్టళ్లను సందర్శించాలని సూచించారు.

కమాండ్ కంట్రోల్ పరిశీలన

అనంతరం ఏఆర్ పరేడ్ గ్రౌండ్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్‌ను అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పరిశీలించారు. పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్, సైబర్ ల్యాబ్‌లను పరిశీలించి, అక్కడి సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. సైబర్ బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం 13 జిల్లాల్లోని పథక సంచాలకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లులేని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు నడుం భిగించిందన్నారు. నిరుపేద మహిళలను గుర్తించి డ్వాక్రా సంఘాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో మెప్మాపీడీ రాధమ్మ పాల్గొన్నారు.

బస్తాల మధ్యలో గుర్తుతెలియని మహిళ మృతదేహం


గోతాల కింద పడిఉన్న మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరసింహారావు

నాయుడుపేటటౌన్: బస్తాల మధ్యలో మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ గోదామును మండల పరిధిలోని మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన నెల్లూరు సిద్ధయ్య, బాలచంద్ర, మధుసూదన్ అనే ముగ్గురు మూడు నెలల కిందట లీజుకు తీసుకుని ధాన్యం వ్యాపారం చేసున్నారు. ఈ గోదాములో సుమారు 800కు పైగా గోతాలను న్విలచేశారు. ఏప్రిల్ నాటికి గోదాము లీజు పూర్తి కావడంతో గోతాలు తరలించేందుకు మంగళవారం చర్యలు చేపట్టారు. కూలీలు గోతాలు తరలిస్తుండగా వాటి కింద ఓ మహిళ మృదేహం బయటపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి వయసు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందని, ఆమె మృతిచెంది రెండు నెలలు అయ్యి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళ ఎవరు? ఇక్కడ ఎందుకు మృతి చెందింది అన్నదానిపై విచారణ చేపడుతున్నట్టు సీఐ నరసింహారావు, ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

శ్రీసిటీలో 66 మందికి ఉద్యోగాలు


ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానికంగా ఉన్న శ్రీసిటీలోని పలు పరిశ్రమలలో ఉద్యోగాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం సాయంత్రం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన'బాజ్ అచీవ్‌మెంట్ డే' కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు సూళ్లూరుపేట ఆర్డీవో సునిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సత్యవేడు నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాల, శ్రీసిటీ ఏర్పాటుకు అనుమతులిచ్చారని గుర్తుచేశారు. స్థానికంగా చదువుతున్న పేద విద్యార్థులకు దూరప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలోని శ్రీసిటీలో ఉద్యోగాలు అభించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలలో హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, హాస్టల్ మంజూరుకు చొరవ చూపాలని ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ జీ.ఉషాదేవి కోరారు. అనంతరం ఇంటర్వ్యూలలో ఎంపికైన వారికి కంపెనీ నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కళాశాల పరిధిలో వివిధ గ్రూపులలో 86 మంది చదువుతుండగా అందులో 66 మందికి జాబ్‌మేళాలో ఉద్యోగ అవకాశాలు పొందారని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కేఎస్.ప్రకాష్ నారాయణ తెలిపారు. మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, తహసీల్దారు శ్రీదేవి, అధ్యాపకులు రాఘవాచ్చారి, దేవాన్, భరత్, రాజానాయక్, ముదిత, స్నేహ, వందన పాల్గొన్నారు.

బిడ్డ ఇక లేడని.. ఆగిన తల్లి గుండె

- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి
- ఆ వార్త జీర్ణించుకోలేక కన్నుమూసిన అమ్మ
- శోకసంద్రంలో తుంగారంపల్లి


చెంగమ్మ (ఫైల్ ఫొటో)


శేఖర్(ఫైల్)

చంద్రగిరి (తిరుపతి రూరల్): స్విచ్ బోర్డు ఓ కుటుంబంలో విషాదం నింపింది. విద్యుత్ వెలుగులకోసం ప్రయత్నిస్తే ఆ కుటుంబాన్ని అంధకారంలో చుట్టేసింది. విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందగా, కుమారుడి మరణ వార్తను జీర్ణించుకోలేక తల్లి గుండె ఆగిపోయిన ఘటన చంద్రగిరి మండలం తుంగారంపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. తుంగరాంపల్లికి చెందిన శేఖర్(30) తిరుపతి స్విమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో అంతర్గతంగా విద్యుత్ సరఫరాలో సమస్య ఉండడంతో స్విచ్ బోర్డులో రిపేరు చేసేందుకు ప్రయత్నించాడు. అసలే నైపుణ్యం లేని పనికావడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్పృహతప్పి కిందపడిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన శేఖర్ భార్య రోజా గ్రామ వలంటీర్‌గా పనిచేస్తుంది. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆగిన తల్లి గుండె

కుమారుడి మరణ వార్తను విన్న తల్లి చెంగమ్మ(52) తీవ్ర మనస్తాపానికి గురైంది. గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆమెను చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒకే ఇంట్లో తల్లి, కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఔరా..అల్లూరయ్యా!

శ్రీకాళహస్తి మున్సిపల్ ఉద్యోగి చేతివాటం

- రాజీవ్‌నగర్‌లో ప్లాట్ల విక్రయం
- సిమెంటు, స్టీలు కోసం లబ్ధిదారుల నుంచి పట్టాల సేకరణ
- ఎంతకీ పట్టాలు ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యేకు ఫిర్యాదు
- అధికారుల సోదాలో ఉద్యోగి ఇంట్లో వందల సంఖ్యలో పట్టాలు


సోదాలు చేస్తున్న అధికారులు (ఇన్‌సెట్) అల్లూరయ్య


అల్లూరయ్య నూతనంగా నిర్మించిన భవనం

సాక్షి, తిరుపతి/శ్రీకాళహస్తి : కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ఇళ్ల స్థలాలను విక్రయించి సొమ్ముచేసుకుంటున్న మున్సిపల్ ఉద్యోగి బాగోతం బట్టబయలైంది. శ్రీకాళహస్తి మున్సిపల్ ఉద్యోగి అల్లూరయ్య నివాసంలో మంగళవారం రెవెన్యూ, పోలీసులు, మున్సిపల్ అధికారులు సోదాలు చేయగా వందల సంఖ్యలో ఇంటి పట్టాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అల్లూరయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాలు.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీకాళహస్తి సమీపంలో ఆరు వేల మందికి రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీచేశారు. దానికి రాజీవ్‌నగర్ అని నామకరణం చేశారు. లబ్ధిదారులకు పక్కాగృహాలు మంజూరు చేసి.. మూడు విడతల్లో రెండువేల చొప్పున పక్కాగృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో హౌసింగ్‌లో అల్లూరయ్య కాంట్రాక్టు ఉద్యోగి. పక్కాగృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం సిమెంటు, కమ్మి లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వగా.. అందు కోసం లబ్ధిదారులు ఇంటిపట్టా, రేషన్ కార్డు హౌసింగ్ అధికారులకు చూపించాల్సి వచ్చేది. ఆ సమయంలో అల్లూరయ్య ఆ పట్టాలను తన వద్దే ఉంచుకున్నాడు. వాటిని ఒక్కొక్కటిగా విక్రయించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. తర్వాత అతనిపై ఆరోపణలు రావడంతో ఉద్యోగం నుంచి తొలగించారు.

టీడీపీ నేతల సహకారంతో మున్సిపాలిటీలోకి

సస్పెండ్ అయిన అల్లూరయ్య తండ్రి శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో పనిచేసేవాడు. ఆయన తదనంతరం ఉద్యోగం కోసం అల్లూరయ్య టీడీపీ నేతలను ఆశ్రయించాడు. టీడీపీ నేతల సహకారంతో మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. టీడీపీ నాయకుల సహకారంతో ప్లాట్ల విక్రయానికి తెరతీశాడు. నాడు రూ.30 వేలు విలువ ఉన్న ఒక ప్లాటు ప్రస్తుతం రూ.5 లక్షలకుపైనే విక్రయించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు అల్లూరయ్యను పట్టాలడగగా.. తనవద్ద లేవని తిప్పించేవారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆశ్రయించడంతో ఆయన అధికారులను పిలిచి విచారించమని ఆదేశించారు. తహసీల్దార్ రూప్ చంద్, సుదీర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్, శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ మల్లికార్జున సిబ్బందితో కలిసి అల్లూరయ్య నివాసంలో సోదాలు చేయగా వందల సంఖ్యలో పట్టాలు బయటపడ్డాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని అల్లూరయ్యని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పేదలను మోసంచేస్తే సహించేది లేదు

ప్రజలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదు. వారిపై కఠిన చర్యలు తప్పవు. నాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలన్నది వారి కల. అందు కోసం ప్రభుత్వమే భూములు కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా పక్కాగృహాలు కట్టించి ఇస్తోంది. అటువంటి వాటిలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాళహస్తి